తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాదాద్రి భువనగిరి
గురువారం
22 అక్టోబర్ 2026
పేజీలు : 08

## ఘనంగా ముగిసిన శ్రీదుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు



సూర్యాపేట (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ లో శ్రీదుర్గామాత శరన్నవరాత్రోత్సవాల మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం లక్కీ డ్రా నిర్వహించారు.సిద్దిపేట జిల్లాకు చెందిన బారు కిన్లేర్ బుల్లెట్ బైక్ ను గెలుచుకున్నారు.సూర్యాపేటకు చెందిన ఎండి.మలియాఖాన్ ఒక గ్రామ్ బంగారాన్ని, నల్లగొండకు చెందిన లింగంపల్లి గణేష్ 20 గ్రాముల వెండిని లక్కీ డ్రా లో గెలుచుకున్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతలందరికీ ధన్య వాదాలు తెలిపారు.దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో శ్రీస్వప్న, శైలజ, దుర్గాదేవి, భూదేవి, మంజుల, రజిత, వరలక్ష్మి, స్వాతి, శైలజ, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- పోలీసుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం
- ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను ఎప్పటికీ మరువం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహా





సూర్యాపేట (జనంసాక్షి): ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో అమరులైన పోలీసు వీరుల త్యాగాలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినం, పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు.విధి నిర్వహణలో దేశ వ్యాప్తంగా ప్రాణాలు అర్పించిన 154 మంది అమరవీర జవాన్ ల పేర్లను అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి స్మరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కేవలం గతంలో ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరులను స్మరించుకునే రోజు మాత్రమే కాదని, వారి త్యాగాల నుంచి స్ఫూర్తి పొంది ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలు అందించాలని ప్రతిజ్ఞ చేసే రోజని పేర్కొన్నారు. తమ ప్రజలు కుటుంబాలతో ప్రశాంతంగా జీవించడానికి, సమాజంలో శాంతిభద్రతలు కొనసాగడానికి, మహిళలు, పిల్లలు, వృద్ధులు భయం లేకుండా జీవించడానికి పోలీసు సిబ్బంది నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు.పోలీసు ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదని, అది బాధ్యత, నిబద్ధత, సేవాభావంతో కూడిన పవిత్రమైన వృత్తి అని అన్నారు.విధి నిర్వహణలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితుల్లోనూ ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీసులు ముందుకు సాగుతారని పేర్కొన్నారు. పోలీసు యూనిఫాం కేవలం దుస్తులు మాత్రమే కాదని, ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకానికి, గౌరవానికి ప్రతీక అని తెలిపారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని అన్నారు.పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలను గౌరవిస్తూ వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి నైతిక బాధ్యత అని అన్నారు.ప్రజలకు న్యాయం చేయడమే అమరవీరులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది తమ ప్రవర్తనలో పారదర్శకతను, విధి నిర్వహణలో నిబద్ధతను ప్రదర్శించాలని అన్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ, బాధితులకు అండగా నిలుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ను కొనసాగించాలని సూచించారు.స్మృతి పరేడ్కు రిజర్వ్ ఇన్స్పెక్టర్ జానయ్య పరేడ్ కమాండర్గా వ్యవహరించగా, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహాచారి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివకుమార్, వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, చరమందరాజు, ప్రతాపలింగం, రామకృష్ణ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, నారాయణ రాజు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, పోలీస్ సంఘం అధ్యక్షులు రమేష్, సెక్రెటరీ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన దసరా వేడుకలు

## పోలీసుల పటిష్ట బందోబస్తు



కొండమల్లేపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి): మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు జరిగిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జమ్మి పూజ, పాలపిట్ట దర్శనంతో దసరా వేడుకలకు భక్తులు ఘనంగా ముగింపు పలికారు. ప్రధాన ఆలయాల వద్ద ప్రజలు కుటుంబ సమేతంగా హాజరైయ్యారు. కొండమల్లేపల్లి పట్టణంతోపాటు పరిసర ప్రాంత గ్రామాలలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రశాంత వాతావరణంలో జరిగాయి. విజయదశమి పండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్ ల ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దసరా పండుగను ప్రజలందరూ సంతోషంగా సురక్షితంగా జరుపుకునేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. గ్రామాల్లో ఉత్సవాలు, ప్రజల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసుల సమన్వయం, ముందస్తు చర్యలతో దసరా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. పండుగల సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## దసరా కానుకగా మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

### హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి దీప్తి

హాలియా: జనం సాక్షి అక్టోబర్ 21 : మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమని హ లియా మున్సిపల్ చైర్మన్ అన్నారు విజయదశమి పండుగ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ పరిధిలో సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికులకు దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేయబడ్డాయి . చైర్మన్ తమ సతీమణి శ్రీమతి చింతల దీప్తి కలిసి మున్సిపల్ కార్మికులకు దుస్తులను పట్టణాన్ని పరిశుభ్రంగా నిర్వహించడంలో, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని చైర్మన్ గారు పేర్కొన్నారు. పండుగ వేళ కార్మికులకు దుస్తులు అందించి వారి సేవలను గుర్తించడం పట్ల కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వారి అవిశ్రాంత సేవలను గౌరవించడం అభినందనీయం. ఈ కార్యక్రమం చైర్మన్ గారి ప్రజాసేవ దృక్పథాన్ని, కార్మికులపై ఉన్న ఆప్యాయతను చాటిచెప్పింది.





**జాజిరెడ్డిగూడెం మండలం, కోడూరు గ్రామం 1వ వార్డులో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహ శోభాయాత్ర సందర్భంగా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్ రెడ్డి తన సొంత ఖర్చులతో బుధవారం కోలాట బృందం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని ప్రశాంతత పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.**

## ఘనంగా విజయదశమి వేడుకలు

సూర్యాపేట(జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు.మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కుటుంబసమేతంగా ఆయుధ పూజ, వాహన పూజలు నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లా కేంద్రంలోని జెజె నగర్ లో గల శ్రీకనకదుర్గమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్లకు యూనిఫాంల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కనకయ్య



**టేకులపల్లి, అక్టోబర్ 21(జనంసాక్షి):** ఇల్లందు డివిజన్ టిప్పర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిప్పర్ లారీ డ్రైవర్లు, క్లీనర్లకు బుధవారం యూనిఫాంలు పంపిణీ చేశారు. టేకులపల్లిలోని టిప్పర్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు నెలవెల్లి నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై కార్మికులకు యూనిఫాంలు అందజేశారు.

ఈ సందర్భంగా డ్రైవర్లు, క్లీనర్లు నిత్యం రహదారుల పై విధులు నిర్వహిస్తూ రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కార్మికుల అవసరాలను గుర్తించి వారికి యూనిఫాంలు పంపిణీ చేయడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్ర మాలు కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్, టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు నెలవెల్లి నరసింహారావు, చిట్టిబాబు, ప్రధాన కార్యద ర్శి అరవ వెంకట్, టేకులపల్లి ఎస్సై తిరుపతి, బోడ మంగీలాల్, డ్రైవర్ యూనియన్ నాయకులు పాయం వెంకన్న, యాకూబ్ షావలి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్టాండ్‌కు 10 సీలింగ్ ఫ్యాన్ల వితరణ

## ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి అందజేసిన చల్లగుల్ల నాగేశ్వరరావు



భద్రాచలం అక్టోబర్ 21 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి దేశ విదేశాల నుంచి, ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు పది సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. జీవన్ హాస్పిటల్, కోశల హోటల్ అధినేత, రిటైర్డ్ టీఎన్జీవో అధ్యక్షుడు చల్లగుల్ల నాగేశ్వరరావు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్యకు ఫ్యాన్లను అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, భద్రాచలం రామయ్య దర్శనానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. బస్సులు అందుబాటులో లేని సమయాల్లో చాలామంది ప్రయాణికులు బస్టాండ్‌లోనే విశ్రాంతి తీసుకుంటారని పేర్కొన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా, దోమల బాధ నుంచి కొంత ఉపశమనం కలిగిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఫ్యాన్లను అందించినట్లు వెల్లడించారు. డిపో మేనేజర్ జంగయ్య మాట్లాడుతూ, బస్టాండ్‌లో కొన్ని ఫ్యాన్లు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి పది సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందించడం అభినందనీయమన్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని సహకరించిన నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. విజయశ్రీ, స్టేషన్ మేనేజర్ ఎం. వీరవెంకన్న, విధి నిర్వహణలో ఉన్న కంట్రోలర్ మీసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో వసుధ సేవలు మరువలేనివి.

## నిరుపేద క్యాన్సర్ బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం



భద్రాచలం అక్టోబర్ 21 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేదలకు విద్య, వైద్య రంగాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక చేయూత అందించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.

భద్రాచలం పట్టణానికి చెందిన జి. భద్రకాళి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో ఆమె వైద్య చికిత్స నిమిత్తం వసుధ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని భద్రకాళి కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.10 వేల సాయం అందించాలని ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజుకు సూచించారు. ఈ మేరకు బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో డీజేలు పెడితే కేసులు నమోదు



**తిరుమలాయపాలెం అక్టోబర్ 19 (జనంసాక్షి):** దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేయవద్దని తిరుమలాయపాలెం ఎస్సై పి. సురేష్ మండల ప్రజలకు, యువతీ యువకులకు, గ్రామ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. ఊరేగింపులలో డీజేల వల్ల అధిక శబ్ద తీవ్రతతో ప్రజలకు హాని కలిగే అవకాశం ఉన్నందున వాటిని వినియోగించరాదని సూచించారు. పోలీస్ వారి నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే దుర్గామాత వేడుకల నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు, డీజే యజమానులు, ఆపరేటర్లు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, డీజేలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై పి. సురేష్ కోరారు.

# వరద తాకిడికి గురైన వెంకన్న ఆలయానికి 'వారధి' బాసట

## మరమ్మతులకు రూ.25 వేల ఆర్థిక సాయం చేయూతనివ్వాలని దాతలకు పిలుపు



**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని కాల్వఒడ్డు ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు 'వారధి ఫౌండేషన్' ముందుకొచ్చింది. విజయదశమి సం దర్భంగా మంగళవారం సంస్థ చైర్మన్ చింతనిప్పు కృష్ణచైతన్య రూ.25 వేల విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మేడూరి రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. ఇటీవల మున్నేరు వరదల వల్ల ఆలయం తీవ్రంగా దెబ్బతిన్నదని, అక్కడ మళ్లీ పూజలు, నిత్య నైవేద్యాలు సజావుగా సాగాలనే ఉద్దేశంతోనే ఈ తక్షణ సాయం అందించామన్నారు. తమ ఫౌండేషన్ చేపట్టే సామాజిక సేవా ప్రస్థానాన్ని కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో, ఇలాంటి దైవకార్యంతో ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. సంక్షోభంలో ఉన్న ఆలయాన్ని పూర్వ స్థితికి తీసుకొచ్చేందుకు భక్తులు, దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి తమ వంతు సాయం అందించాలని కోరారు. కార్య క్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.సాయి, చిక్కుళ్ల వెంకటేశ్, పగిళ్లపల్లి రాజు, నాగరాజు, శివ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# బాలపేటలో ఘనంగా కనకదుర్గమ్మ శోభాయాత్ర

## పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు భూక్య అశోక్



**ఖమ్మం, (జనంసాక్షి) :** నగరంలోని 8వ డివిజన్ పరిధి బాలపేటలో శ్రీ కనకదుర్గమ్మ వారి శోభాయాత్ర బుధవారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్రలో పాల్గొన్నారు. తొలుత ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భూక్యా అశోక్ మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం, ఐక్యత వెల్లివిరుస్తాయన్నారు. ఊరేగింపు వేళ భక్తులు, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అజ్మీరా వెంకన్న, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నతండ్రికి అంత్య క్రియలు చేసిన చిన్నారి కూతురు

## దురదృష్టవశాత్తు 11 ఏళ్లకే తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**పెనుబల్లి, అక్టోబర్ 21(జనం సాక్షి) :** చిన్న తనం లోనే అనారోగ్యం తొ మృతి చెందిన తండ్రికి ఇద్దరు కూతుళ్ళ లొ పెద్దకూతురు అంత్య క్రియలు చేసి, తల కొరివి పెట్టిన దయనీయ సంఘటన బుధవారం పెనుబల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన వంగా వంశీ (నరేష్ )31 అనారోగ్యంతో హఠాత్తుగా మృతి చెందాడు. వయోభారంలో ఉన్న తల్లి, భార్య, చిన్న వయసులో ఉన్న ఇద్దరు కూతుళ్లతొ తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయంచేస్తూ,ప్రైవేట్ ఎలక్ట్రిషన్ గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. పెద్ద కూతురు బిందు, చిన్న కూతురు ఇందు వీరిద్దరూ 7వ ,5వ తరగతులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు.దురదృష్టవశాత్తు అనారోగ్యానికి గురై హఠాత్తుగా మృతి చెందాడు. దీంతో కుటుంబంలో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. వంశీకి కొడుకు లేకపోవడంతో పెద్ద కూతురు బిందు తన తండ్రిచివరి కోరిక మేరకు అంత్యక్రియలు చేయడం జరిగింది. చిన్నారి కూతుళ్ళ ఆలనా పాలన చూసుకో కుండానే హఠాత్ మరణం పొందిన వంశీని, చిన్నతనంలోనే తన తండ్రి అండదండలు కోల్పోయిన కూతుళ్లను చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

# పోలీస్ అమరవీరులకు ఎంపీ వద్దిరాజు నివాళులు



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 21 (జనం సాక్షి) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విధి నిర్వహణలో అమరులైన పోలీస్ వారికి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను ఆయన గుర్తు చేశారు.శాంతి భద్రతలను కాపాడడమే కాక ప్రజల ప్రాణ,ఆస్తుల రక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ప్రజల భద్రతనే తమ పరమావధిగా భావించి విధి నిర్వహణలో ప్రాణాలు సైతం త్యజించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, చిరస్మరణీయమన్నారు. ఎండనక,వాననక,చలిలో రాత్రింబవళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ వారు అందిస్తున్న నిస్వార్థ సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. ప్రజల భద్రత కోసం వారు చేసిన త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని,వారి ఆశయాలు,స్ఫూర్తి పోలీసులకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎంపీ వద్దిరాజు తన సందేశంలో పేర్కొన్నారు.

# దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**సూర్యాపేట (జనంసాక్షి):**జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ సెంటర్ లో బీరవోలు యువసేన ఆధ్వర్యంలో దేవి నవరాత్రోత్సవాల 21వ వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా లో రచ్చ శివ పవన్ కళ్యాణ్ టీవీఎస్ జూపిటర్ బైక్ తో అమ్మవారి చీరను గెలుచుకున్నారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా దేవి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చెరుకు చంటి, చెరుకు వేణు, జిట్టబోయిన సాయిదీపం, పాలకూరి మహేష్, చెట్ట మౌనిశ్వర్, ఉదయ్, నిఖిల్, సతీష్,మల్సూర్, సందీప్, దుర్గ భవాని, మల్లీశ్వరీ, రేణుక, ప్రసన్న, చిట్టి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.30 లక్షలతో సాయిబాబాకు స్వర్ణ సింహాసనం

- భక్తుల విరాళాలతో బంగారు సింహాసనం ఏర్పాటు.
- స్వర్ణ సింహాసనంపై దర్శనమిస్తున్న సాయిబాబా.



**భద్రాచలం అక్టోబర్ 21 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలోని శ్రీ సాయిబాబా మందిరంలో సుమారు రూ.30 లక్షల విలువైన స్వర్ణ సింహాసనాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అందించిన విరాళాలతోపాటు ఆలయంలోని నగదును వినియోగించి ఈ సింహాసనాన్ని తయారు చేయించారు. బుధవారం ప్రత్యేక పూజల అనంతరం స్వర్ణ సింహాసనాన్ని ప్రారంభించగా, బాబావారు బంగారు సింహాసనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భద్రాద్రి రామాలయ అభివృద్ధితోపాటు శ్రీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి కూడా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయంలో స్వర్ణ సింహాసనం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోమవనాపల్లి ఆదినారాయణ, గౌరవ అధ్యక్షుడు కురిచేటి శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై విద్యాభ్యాసం చేస్తూ చదువుల్లో రాణిస్తున్న రామన్నగూడెం గ్రామానికి చెందిన పొట్టిపాక లింగయ్య-రేణుకల కుమార్తె శ్రావ్యను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. చదువుల్లో టాపర్‌గా నిలుస్తున్న శ్రావ్య భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల్ , వంశీ, ఎస్సీకాలనీ వాసులు పాల్గొన్నారు.**

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో
# రైతులకు అధిక ఆదాయం

- భూగర్భ జలాల సంరక్షణ, విద్యుత్ పొదుపుపై దృష్టి సారించాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి. పాటిల్



**బీబీనగర్ (జనంసాక్షి):** రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీజీఎస్పీడీసిఎల్ సీఎండీ జితేశ్ వి. పాటిల్ ఐఏఎస్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించి, భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, చినరావులపల్లి, బట్టుగూడెం గ్రామాలతో పాటు వలిగొండ మండలంలోని మందాపురం గ్రామాలను సీఎండీ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వ్యవసాయ సమస్యలు, పంటల సాగు విధానాలు, నీటి లభ్యతపై చర్చించారు. మునగ, వివిధ రకాల కూరగాయలు వంటి వాణిజ్య పంటలను సాగు చేయడంతో పాటు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తే రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. వరి సాగుతో పోలిస్తే తక్కువ నీరు, విద్యుత్ అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా పెట్టుబడి, నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

**రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి..**

రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ి డీజే ఎస్పీ డీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) యు. బాలస్వామి, యాదాద్రి సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. సురేశ్ కుమార్, భువనగిరి డివిజనల్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వర్లు, డివిజనల్ ఇంజనీర్ విజయభాస్కర రెడ్డి, బీబీనగర్ ఏడీఈ వి. మచ్చేందర్, ఏఈ డి. మనోహర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్ లు భుక్య నరేందర్, స్వామి, బాల్ నర్సింహ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



**అర్వపల్లిలోని వైజంక్షన్‌లో ఉన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విగ్రహానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ఆర్డీఆర్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఎంతో జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, జాజిరెడ్డిగూడెం సర్పంచ్ బింగి కృష్ణమూర్తి, వల్లాల ఖాజ , ఎల్లంల కొమిరెల్లి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.**

## శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దసరా జాతర అంగరంగ వైభవం

**మేళ్లచెరువు, జనం సాక్షి న్యూస్:** మేళ్లచెరువు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో దసరా మహోత్సవాల సందర్భంగా జమ్మి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, శమీ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు జమ్మి ఆకులను పంపిణీ చేశారు. కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, కొంకపాక ధనుంజయ్ శర్మ, సాయి మహేష్, నాగ శివ మృత్యుంజయ శర్మ తదితర బ్రాహ్మణులు వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అనంతరం గ్రామసేవ, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చు పద్మావతి, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఈవో నాగేళ్ల శంబిరెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ



**సూర్యాపేట (జనంసాక్షి)** :విజయదశమి పర్వదిన వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల జిల్లా పరిషత్ కార్యాలయం వేదికగా నిర్వహించిన శమీ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు రామ్ కో సిమెంట్స్ వారిచే ప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దాతలుగా ముందుకు వచ్చిన జిల్లా ఆదికృత డీలర్ తల్లాడ వెంకటేశ్వర్లు, రామ్ కో గ్రూప్ మేనేజర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.ఈ విజయదశమి ఉత్సవాలలో పాల్గొన్న అతిథులు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు రామ్ కో సిమెంట్స్ నిర్వహకులను అభినందించారు.



**విజయదశమి సందర్భంగా మంగళవారం రాత్రి జాజిరెడ్డిగూడెంలో శ్రీ యోగనంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లను అధిరోహింపచేసి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఇంటింటికి మంగళహారతులతో స్వామికి స్వాగతం పలికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బింగి కృష్ణమూర్తి, ఆలయ నిర్వాహకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.**

# తెలంగాణ రక్షణ సేనలో కీలక నియామకం

### బొడ్డుపల్లి చంద్రశేఖర్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులు

**హాలియా జనం సాక్షి అక్టోబర్ 21:** తెలంగాణ రక్షణ సేన పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొడ్డుపల్లి చంద్రశేఖర్‌ను నియమిస్తూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో నియోజకవర్గ ప్రజల సేవకు, పార్టీ బలోపేతానికి కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా మాట్లాడిన బొడ్డుపల్లి చంద్రశేఖర్, తనపై నమ్మకం ఉంచి నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను కేవలం పదవిగా కాకుండా, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండా

"ప్రజల సమస్యలే నా ఎజెండా, ప్రజాసేవే నా లక్ష్యం" అని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

యువతకు అవకాశాలు కల్పించడం, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు మరియు బడుగు బలహీన వర్గాల సమస్యలపై ప్రజల తరపున నిలిచి పోరాడతానని ఆయన అన్నారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తానని వివరించారు.



## సబ్‌స్టేషన్ నిర్మాణానికి 25 గుంటల భూమి విరాళం

**చిలుకూరు,అక్టోబర్ 21 (జనంసాక్షి):** చిలుకూరు మండలం ఆచార్యులగూడెం గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు గ్రామానికి చెందిన దుస్స వెంకట రామనరసయ్య 25 గుంటల వ్యవసాయ భూమిని బుధవారం విరాళంగా అందజేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడేందుకు సబ్‌స్టేషన్ నిర్మాణం దోహదపడుతుందని ఆయన భూమిని అందించేందుకు ముందుకొచ్చారు. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భూమి దాతకు అభినందనలు

గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం విలువైన 25 గుంటల భూమిని విరాళంగా అందించిన దుస్స వెంకట రామనరసయ్య సేవాభావం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఆయన అందించిన ఈ సహకారం మరువలేనిదని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. సర్పంచ్ బోడ్డుపల్లి లక్ష్మి ,ఉప సర్పంచ్ నెమ్మాది వీరబాబు,మోలారిశెట్టి రాంబాబు,గట్టు వీరయ్య,సారెడ్డి నర్సిరెడ్డి, మైలారిశెట్టి చిన్న యలమందయ్య,ముషి శ్రీనివాస్, బొల్లెపల్లి రామయ్య, మైలారిశెట్టి వెంకయ్య,ముషి రామయ్య, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి,కె వీరయ్య, బిక్షం, వినోద్ రెడ్డి, ఆదినారాయణ, ఎ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## లక్కీడ్రా లో ఎలక్ట్రిక్ బైక్ గెలుచుకున్న సాయి

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో గల రామాలయం వద్ద దేవి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా లో మొరగుంట్ల సాయి ఎలెక్ట్రిక్ బైక్ ను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంటు రామకృష్ణ, ఆదిమల్ల వేణు, అబ్రహం కిరణ్, రణధీర్, చిన్ను, నవీన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## చల్లగా చూడు దుర్గమ్మ మళ్ళీ ఏడు తిరిగిరావమ్మా

### భజనలు, కోలాటాల బృందాల నడుమ సాగిన దుర్గామాత శోభాయాత్ర

**కనగల్లు, అక్టోబర్ 21 (జనం సాక్షి):** శ్రీదేవి శరన్నవరాత్ర ల ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులు భవాని మాల ధారణ స్వాముల నిత్య పూజలతో వివిధ రూపాలలో అలంకరణ అలంకరించబడి భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ప్రతిరోజు అమ్మవారికి అలంకరించిన చీరలను స్వాములు వేలంపాట నిర్వహించగా భక్తులు ఎంతో ఆసక్తిగా పాటలో పాల్గొని సొంతం చేసుకున్నారు. నవరాత్రుల సందర్భంగా రోజువారీగా అమ్మవారి మండపాల వద్ద , భజనలు, మహిళలు బతుకమ్మ చప్పట్లతో కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రాత్రులు పూజలందుకొని పదవరోజు దుర్గామాత సన్నిధిలో ఉన్న లడ్డు ను దక్కించుకోవడానికి ప్రజలు పోటీ పడ్డారు.



అమ్మవారిని గ్రామ పురవీధుల గుండా కోలాటాలు బృందాల చే శోభయాత్ర కొనసాగుతున్న క్రమంలో అమ్మవారికి మహిళలు ఎదురు వెళ్లి జలాభిషేకం, కొబ్బరికాయలు కొట్టి అమ్మవారి ఆశీస్సులు పొందారు. చిన్నారులు, మహిళలు, యువకులు తమ ఆటపాటలతో చల్లగా చూడు దుర్గమ్మ మళ్ళీ ఏడు తిరిగి రావమ్మా అంటూ దుర్గామాతను నిమజ్జనానికి సాగనంపారు . అనంతరం భవాని మాలధార స్వాములు బెజవాడ దుర్గమ్మ సన్నిధికి వెళ్లి మొక్కులను చెల్లించుకున్నారు.

## హత్యాయత్నం కేసులో నలుగురు నేరస్తుల రిమాండ్

**హుజూర్‌నగర్ రూరల్, అక్టోబర్ 21(జనంసాక్షి):** ఈనెల 19వ తేదీన వేపల సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని మిట్ట గూడెం కాలనీకి చెందిన సూరోజు మధుసూదనాచారి, సూరోజు భార్గవచారి లను గాయపరిచిన నలుగురు వ్యక్తులను పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ బుధవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం

1) ధరావత్ మహేష్( 22)

2) తేజావత్ వంశీ (26)

4) ధరావత్ శ్రీను నాయక్ (46) ఈ నలుగురు వ్యక్తులు మిట్టగూడం కాలనీకి చెందిన గిరిజన కుటుంబానికి చెందినవారే నని ఆయన తెలిపారు.

## ఆపదలో మిత్రుడికి అండగా 2015--16 బ్యాచ్ విద్యార్థులు

### గ్యాస్ లీకేజీ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.14,600 ఆర్థిక సాయం

**చిలుకూరు, అక్టోబర్ 21 (జనంసాక్షి):** పదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని చాటుతూ 2015--2016 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు గుంజ శివకోటికి అండగా నిలిచారు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఇటీవల గ్యాస్ లీకేజీ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగి శివకోటి, ఆయన తల్లి గాయపడిన విషయం తెలుసుకున్న మిత్రులు స్పందించి, తమకు తోచినంత ఆర్థిక సాయం అందించారు. మిత్రుడి కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాన్ని గుర్తించిన బ్యాచ్ సభ్యులు పరస్పరం సహకరించుకుని మొత్తం రూ.14,600 సేకరించి శివకోటికి అందజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో బాలురు, బాలికలు కలిసి పాల్గొని తమ స్నేహబంధాన్ని, సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

ఆపద సమయంలో బాధితులకు అండగా నిలవడం ద్వారా వారికి



మనోధైర్యాన్ని కల్పించవచ్చని ఈ సందర్భంగా మిత్రులు తెలిపారు. కష్టకాలంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ శివకోటి కుటుంబానికి అండగా నిలిచిన బ్యాచ్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. మిత్రుడి కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించిన 2015--2016 బ్యాచ్ విద్యార్థుల సేవాభావంపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.

## వైభవంగా కనకదుర్గమ్మ దేవి శోభాయాత్ర

**మాడుగులపల్లి, అక్టోబర్ 21 (జనం సాక్షి):** మండలంలోని పలు గ్రామాలలో శ్రీ కనకదుర్గమ్మ దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి అమ్మవారి నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామాలలో అమ్మవారి శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు

ఈ శోభాయాత్రలో మహిళలు కోలాటాలు ఆడుతూ, భజన బృందాలు భక్తి కీర్తనలతో హోరెత్తించాయి చిన్న, పెద్ద తేడా లేకుండా భక్తులందరూ కలిసికట్టుగా ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు గ్రామ వీధులన్నీ అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి

శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. పోలీసుల పర్యవేక్షణలో ఉత్సవాలు పూర్తిగా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయి.





## ఉమామహేశ్వర దేవస్థానాన్ని సందర్శించిన అధికారులు

**చింతలపాలెం(జనంసాక్షి):** చింతలపాలెం మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంను దసరా పండుగ సందర్భంగా కొత్తగా నియమితులైనటువంటి ఎండో మెంట్ అధికారి ఈవో కూన్ రెడ్డి కొండారెడ్డి, చింతలపాలెం ఎస్సై పరమేష్ స్వామిని దర్శించుకోవడం జరిగింది. దేవాలయ కమిటీ చైర్మన్ కారంగుల హుస్సేన్, వారిని శాలువాలతో సత్క రించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, ఆలయ అర్చకులు నార్ల మహేష్ శర్మ, మోర్తాల సీతారెడ్డి, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు వీరంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చిత్తలూరి వీరబాబు,చింతలచెరువు వీర రాజు,గంధం కొండ, నేమోజు పరిపూర్ణాచారి,దొండపాటి నాగమణి, చిలక యేసు, గూడెపు కొండ పాల్గొనడం జరిగింది.

# అంబరాన్నంటిన దసరా సంబురాలు

## భక్తిశ్రద్ధలతో శమీ పూజలు

**సూర్యాపేట (జనంసాక్షి):** చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా సంబరాలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల జిల్లా పరిషత్ కార్యాలయంలో మున్సిపాలిటీ సహకారంతో శ్రీసంతోషిమాత దేవాలయం ఆధ్వర్యంలో గత 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శమీ పూజకు భక్తులు భారీగా తరలివచ్చారు.ప్రత్యేక క్యూ లైన్ ద్వారా వెళ్లి శమీ పూజలో పాల్గొని జమ్మి చెట్టుతో పాటు స్థానికంగా అన్ని దేవాలయాల వారు ఏర్పాటుచేసిన ఉత్సవ విగ్రహా దేవతమూర్తులను దర్శించుకున్నారు.సాంప్రదాయ పద్ధతిలో శమీ మంత్రంతో రూపొందించిన కరపత్రాలపై భక్తులు తమ కోరికలు రాసుకొని జమ్మి చెట్టుకు కట్టారు.దసరా రోజున పాలపిట్ట చూడటం అనాదిగా వస్తున్న ఆచారం కావడంతో అక్కడ పాలపిట్టను తిలకించారు. వేద పండితులు భక్తులకు శమీ ఆకు అందజేసి ఆశీర్వదించారు.చిన్నారుల నుంచి పెద్దల వరకు పెద్ద ఎత్తున తరలిరావడంతో జమ్మిగడ్డ ప్రాంతమంతా జన సంద్రమై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఈ వేడుకలలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్



రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,మున్సిపల్ కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు, నాయకులు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.సంతోషిమాత దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కైలాస శంకర్ ల స్టేజి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సంతోషిమాత దేవాలయం గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశ గుప్తా,అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు, కన్వీనర్ నరేంద్రుని విద్యాసాగర్ రావు,కో కన్వీనర్ బోనగిరి విజయకుమార్,గోపారపు రాజు,ఉప్పల రమేష్,నూక రవిశంకర్, శివప్రసాద్,తల్లాడ కృష్ణమూర్తి, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయదశమి రోజున సంతోషిమాత అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తప్పిపోయిన బాలిక

**అశ్వరావుపేట అక్టోబర్21,(జనంసాక్షి):** అశ్వారావుపేట మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన మడకం అనూహ్య (16) సంవత్సరాలు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తేదీ: 12-10-2026 న ఉదయం స్పోర్ట్స్ మీట్ క్యాంపులో పాల్గొనేందుకు కొత్తగూడెం వెళ్లి, తిరిగి ఇంటికి రాకపోవడంతో... ఆమె తల్లి మడకం శాంతి ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. తప్పిపోయిన బాలిక వివరాలు: మడకం అనూహ్య, వయస్సు 16 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5 అడుగులు, తెల్లని ఛాయ, తప్పిపోయిన సమయంలో నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఆరెంజ్ మరియు ఎరుపు రంగు టాప్ ధరించి ఉంది.బాలిక ఆచూకీ తెలిసిన వారు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌కు సంప్రదించాలని కోరారు.



# భక్తిశ్రద్ధలతో శమీ, ఆయుధ పూజలు



**కనగల్లు, అక్టోబర్ 21 (జనం సాక్షి):** దసరా పండుగ వేడుకలను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవాలయాలలో దుర్గామాత పూజలను చేపట్టి సాయంత్ర సమయంలో డప్పు చప్పులతో ప్రజలు గ్రామ సమీపంలోఉన్న జమ్మి చెట్టు వద్దకు చేరుకొని శమీ,ఆయుధ పూజలు నిర్వహించి జమ్మి చెట్టు చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసి శమే శమీ యతే పాపం అనే శ్లోకాన్ని చదివారు. ఒకరినొకరు అలాయ్, బాలాయ్ చేసుకొని దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కార్యక్రమాలలో ఆర్ టి ఏ జిల్లా సభ్యుడు కుసుకుంట్ల రాజారెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఓర్సు పెంటయ్య, కా రింగు జానయ్య గౌడ్ , నర్సింగ్ మురళీధర్ గౌడ్, అందుగుల సువర్ణ వెంకటేశం, పూలకరం అండాలు వెంకటేశం, భారత కవిత వెంకటేశం, బక్కా ఎల్లమ్మ, నాగవెల్లి నాగమణి, చిలక రాజు సునీత, నల్లబోతు నిర్మల, కటికనేని నలిని, కొండ రవళి, రాయల శేఖర్, పోచమల్ల సురేష్, ఒంపు నాగమణి, సైదయ్య, ఎల్లమ్మ గుడి చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, సొసైటీ చైర్మన్ దోటి శ్రీనివాస్, సహదేవ రెడ్డి, ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి బి ఆర్ యస్ మండల పార్టీ అధ్యక్షులు అయిత గోని యాదయ్య గౌడ్, మాజీ సర్పంచులు నర్సింగ్ సునీత కృష్ణయ్య గౌడ్, గోలి నర్సిరెడ్డి, మెరుగు శివయ్య, కడారి కృష్ణయ్య, రామగిరి శ్రీధర్ రావు అలుగుబెల్లి నర్సిరెడ్డి, పి రాజీవ్, ఉప సర్పంచ్ మార్గం సత్యనారాయణ, దొంతరబోయిన శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పింజర మడుగు, కొమ్మినేపల్లి గ్రామాల్లో వంశ పాండవుల ఉత్సవల ఊరేగింపు

**కామేపల్లి,అక్టోబర్ 21 (జనం సాక్షి):** కామేపల్లి మండల పరిధిలోని పింజరమడుగు, కొమ్మినేపల్లి గ్రామాల్లో వంశ పాండవుల ఉత్సవం ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో పింజరమడుగు కొమ్మినేపల్లి గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రజలు యువకులు మహిళలు యువకులు తోపాటు ప్రత్యేక బృందం కామేపల్లి భక్తమండలి అధ్యక్షులు శివాజీ, మహంకాళి రామ నరసయ్య,దమ్మాలపాటి శివాజీ,రఘు, నాగేష్ తో పాటు పలు గ్రామాలలో వివిధ పార్టీల నాయకులు,మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణగిరిలో నేటి నుంచి ఐదు రోజులపాటు పవిత్రోత్సవాలు

## 22 నుంచి 26 వరకు వైభవంగా విశేష పూజలు

**భువనగిరి, అక్టోబర్ 21 (జనం సాక్షి):** యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అక్టోబర్ 22 నుంచి 26 వరకు ఐదు రోజులపాటు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో, శ్రీరంగం ఉభయ వేదాంతాచార్య పీఠం సూచనల మేరకు వైదిక క్రతువులు, హోమాలు, విశేష అర్చనలు, పవిత్ర సమర్పణలు నిర్వహించనున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ, గోపికృష్ణ మాట్లాడుతూ.. ఆలయంలో జరిగే పూజా కైంకర్యాల్లో తెలిసీ తెలియక జరిగిన లోపాలకు



ప్రాయశ్చిత్తంగా, లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు సూర్యప్రభ, పెద్దశేష, గజ, హనుమంత, కల్పవృక్ష, చంద్రప్రభ, చిన్నశేష, సర్వభూపాల వాహన సేవలతో పాటు చివరి రోజు గరుడ వాహన సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్యదర్శనం చేసుకుని కృపాకటాక్షాలు పొందాలని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# వైభవంగాపూర్ణాహుతితో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

**భక్తిశ్రద్ధలతో 9 రోజులు పూజలు**

**కన్నుల పండుగ శోభాయాత్ర**

**కామేపల్లి, అక్టోబర్ 21(జనం సాక్షి):** అత్యంత భక్తిశ్రద్ధలతో గత తొమ్మిది రోజులుగా జరుపుకున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి కామేపల్లిలో గురు మందిరం ఎంపీ సెంటర్లో రామకృష్ణాపురం సువర్ణ అభయ ఆంజనేయ స్వామి ఆలయాల తోపాటు మండలంలోని పండితాపురం రుక్కి తండా,గోవింద్రాల, పొన్నెకల్, బర్లగూడెం, గరిడేపల్లి,పాత లింగాల,కొత్త లింగాల, పింజరమడుగు, తాళ్ల గూడెం, కామేపల్లి, ఊట్కూర్ జోగుగూడెం.కెప్టెన్ బంజారా,ముచ్చర్ల, జాస్తి పల్లి, సాతాని గూడెం,బాసిత్ నగర్,మద్దులపల్లి లాల్యతండా తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక మండపాలలో దుర్గా మాత విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులుగా 9 రూపాలుగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు జరుపుకున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో అనేకమంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దేవి విశిష్టతలను అర్చకులు భక్తులకు వివరించారు విద్యార్థులతో సరస్వతి పూజ ఆయుధ పూజ వాహన పూజలతో పాటు రావణాసురుడు సంహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం భగవన్నామ సంకీర్తన లతో పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య పూర్ణాహుతితో ముగిశాయి అనంతరం సాంప్రదాయ నృత్యాలతో కోలాటాల మధ్య విగ్రహాలను కృష్ణా జలాలులో నిమజ్జనం చేసేందుకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి భక్తమండలి బృందం అధ్యక్షుడు గుట్టుపర్తి శివాజీ మహాంకాళి సభ్యులు తదితర ఇతర గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు అందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



## భద్రాద్రిలో వైభవంగా

# విజయోత్సవ వేడుకలు

- రామయ్యకు మహాపట్టాభిషేకం
- సంప్రదాయబద్ధంగా శమీపూజ, ఆయుధపూజ



**భద్రాచలం అక్టోబర్ 21 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మహాపట్టాభిషేకం, శమీపూజ, ఆయుధపూజలతో పాటు ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం శ్రీరామలీలా మహోత్సవంలో భాగంగా రావణాసురుడి దహన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది విజయదశమి వేడుకలను రామాలయంలోనే నిర్వహించారు.

ఆలయ వైదిక బృందం వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహాపట్టాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాజోపచారాలు, విశేష ఆరాధనలు, శ్రీరామాయణ పారాయణం, పుష్పాభిషేకం, కలశస్నపనం, హోమాలు, మంగళహారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విజయదశమి సంప్రదాయంలో భాగంగా జమ్మిచెట్టుకు శమీపూజ నిర్వహించారు. స్వామివారి ఆయుధాలైన ధనుస్సు, బాణం, డాలు తదితరాలకు ప్రత్యేక పూజలు చేసి ఆయుధపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వేడుకలు వైభవంగా కొనసాగాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.దామోదర్‌రావు దంపతులు పాల్గొన్నారు.

**వైభవంగా శ్రీరామలీలా మహోత్సవం**

శమీపూజ అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామివారి పాదుకలను మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించే దసరా మండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు రావణాసురుడి నమూనాపై బాణం సంధించి శ్రీరామలీలా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రామభక్తులు, పట్టణవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేడుకల్లో రామాలయ వైదిక, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

**గోదావరిలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం.**

నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను విజయదశమి సందర్భంగా గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిమజ్జనం సజావుగా జరిగేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జన ప్రాంతానికి తరలించి కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన కొత్తపల్లి వెంకట్

**కల్లూరు, అక్టోబర్ 21 (జనం సాక్షి):** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన ఇద్దరు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు పంచాయతీ మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు (వెంబర్ వెంకట్). శాంతినగర్ కాలనీ కి చెందిన అసంఘటిత రంగ భవన నిర్మాణ కార్మికులు ఇటీవల గోపాలకుంటలో ఓ ఇంటి వద్ద తాపీ పని చేస్తుండగా పరంజీ కర్ర విరిగిపడిన ప్రమాద సంఘటనలో ఖమ్మంపాటి నరసింహారావు, గండు సత్యం కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. వైద్య చికిత్సల అనంతరం శాంతినగర్ లోని తమ గృహాలలో మంచానికే పరిమితమై ఆర్థికంగా ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే, అసంఘటితరంగా కార్మికులు పని చేయలేని స్థితికి చేరడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వారి దీనస్థితిని తెలుసుకున్న కొత్తపల్లి వెంకటేశ్వర్లు బుధవారం స్వయంగా వారి గృహాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు.ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు.





ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, మోదుగు రమేష్, తేలపుట్ల శ్రీనివాసరావు, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## దళిత సర్పంచ్‌ల ఆత్మగౌరవంపై

# దాడిని సహించం!

- చిట్టెంపాడు ఘటనపై లపంగి నరసింహ తీవ్ర ఖండన
- సర్పంచ్‌లంతా పార్టీలకతీతంగా ఐక్యంగా నిలవాలి



**మర్రిగూడ, అక్టోబర్ 21 (జనం సాక్షి) :** దళిత మహిళా సర్పంచ్ కుటుంబంపై దాడి జరిగిందన్న ఆరోపణలు ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల గౌరవం, దళితుల ఆత్మగౌరవంపై చర్చకు దారితీశాయి. నాంపల్లి మండలం చిట్టెంపాడు గ్రామంలో సర్పంచ్ భర్త సైదులుపై గ్రామపంచాయతీ వర్కర్ అప్పనబోయిన వెంకటయ్య, ఆయన కుమారుడు ఆంజనేయులు దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, ఉమ్మడి నల్గొండ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లపంగి నరసింహ తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎన్నుకున్న దళిత మహిళా సర్పంచ్ కుటుంబాన్ని అవమానించడం, అధికారాన్ని ప్రశ్నిస్తూ దాడికి పాల్పడటం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. కుల వివక్ష, కుల దురహంకారానికి సమాజంలో చోటు ఉండకూడదని స్పష్టం చేశారు.

**అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి**

చిట్టెంపాడు ఘటనపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, దాడి ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేయాలని లపంగి నరసింహ డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**సర్పంచ్‌ల ఐక్యతే సమాధానం!**

దళితులు రాజకీయాల్లో రాణించ కూడదా? దళిత మహిళ సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేయకూడదా? అని ప్రశ్నించిన నరసింహ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎవరూ సమర్థించరాదన్నారు. ఒక గ్రామంలో జరిగిన ఘటన తమకు సంబంధం లేదని సర్పంచ్‌లు మౌనంగా ఉండకూడదని, రేపు ఇలాంటి పరిస్థితులు మరే గ్రామంలోనైనా ఎదురుకావచ్చని హెచ్చరించారు. పార్టీలు, కులాలకు అతీతంగా సర్పంచ్‌లంతా ఐక్యంగా నిలబడి దళిత సర్పంచ్‌లకు అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. చిట్టెంపాడు సర్పంచ్ కుటుంబానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించిన ఆయన, బాధితులకు న్యాయం జరిగే వరకు సర్పంచ్‌లంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. "సర్పంచ్‌ల ఐక్యతే మన బలం.. ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవమే మన లక్ష్యం" అని లపంగి నరసింహ స్పష్టం చేశారు.